క్లుప్తంగా

చీరల పంపిణీ
వరంగల్: క్రిస్మస్ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27 డివిజన్‌లో పేద వితంతువులకు చీరలను టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ మంగళవారం పంపిణీ చేశారు. కొండా దంపతుల ఆదేశాల మేరకు చీరెలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు లాజర్, మోహన్‌రావు, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు..
ఖిలా వరంగల్: క్రిస్మస్ సందర్భంగా మంగళవారం 37వ డివిజన్ తూర్పుకోటలో డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో బోగి సురేష్, చందర్, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి
న్యూశాయంపేట : మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాన్ని అమలు చేయాలని మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. సారంగపాణి, ఏ.ధర్మరాజు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ఏఐటీయూసీ కార్యాలయంలో యూనియన్ జిల్లా సమితి అత్యవసర కార్యవర్గ సమావేశంలో ఏలియా, యాదమ్మ, ఎల్లస్వామి పాల్గొన్నారు.

టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విల్సన్
కాజీపేట అర్బన్ : తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన జెరిపోతుల విల్సన్ మాదిగను నియమిస్తు టీఎస్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభాకర్‌కు విల్సన్‌మాదిగ కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం
విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైక్రోబయాలజీలో ఒక పోస్టుకు, కంప్యూటర్ సైన్స్ విభాగంలో (కంప్యూటర్ అప్లికేషన్స్) ఒక పోస్టులకు అతిథి అధ్యాపకులుగా నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31న సాయంత్ర 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం
వరంగల్ క్రైం : హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 22న మతిస్థిమితం లేని మహిళ పద్మాక్షిగుండం వద్ద అదృశ్యమైనట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. వరంగల్ రంగంపేటకు చెందిన చెరుకుపల్లి శోభన (35) ఈనెల 22న కుటుంబ సభ్యులతో కలిసి పద్మాక్షి గుండం ప్రాంతంలో బయటి వంటలకు వచ్చి తప్పిపోయినట్లు ఆయన తెలిపారు. వివరాలు తెలిసిన వారు హనుమకొండ పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

కొత్తవాడలో వీర్‌బాల్ దివస్
రామన్నపేట : ప్రధాని మోదీ పిలుపు మేరకు కొత్తవాడలోని రైసింగ్ సైన్ హైస్కూల్‌లో నిర్వహించిన వీర్‌బాల్ దివస్–2024 వేడుకల్లో వీర్‌బాల్ దివస్ రాష్ట్ర కోకన్వీనర్ డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోనే హిందు ధర్మం కోసం నిలబడి పోరాడిన యోధులు జోరవర్‌సింగ్, ఫాతేసింగ్‌లు అని ఆయన అన్నారు.

రైళ్లపై రాళ్ల దాడి చేయొద్దు
ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్ చింతల పల్లి పరిధిలో రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రాళ్ల దాడిపై స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ ఎస్సై వెంకటేశ్వర్లు హాజరై స్థానిక ప్ర జలకు రైలుపై రాళ్లు విసిరివేయడం, నిర్లక్ష్యంగా పట్టాలు దాటడం వంటి పనులు చేయొద్దన్నారు.

డీలర్లు అండగా ఉండాలి
ఖిలా వరంగల్: రైతులకు ఫెర్టిలైజర్స్, అండ్ ఫెస్టిసైడ్స్ డీలర్లు అండగా ఉండాలని, నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందజేయాలని రాష్ట్ర రైతు రుణవిమోచన కమిషన్ మాజీ చైర్మన్, జిల్లా డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సాయికన్వెన్షన్ హాల్‌లో నవత ఆగ్రో కెమికల్స్ ఆధ్వర్యంలో ఫెర్టిలైజర్ల డీలర్ల సమావేశం జరిగింది.

కేయూలో నిరసన
కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కామన్‌మెస్‌లో మంగళవారం రాత్రి 8–25గంటలకే భోజనం అయిపోయిందని ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లాప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆరోపించారు. కొంతమంది విద్యార్థులకు భోజనం లభించలేదని భోజనం అయిపోవటంతో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశామన్నారు. కామన్ మెస్‌లో ఖాళీ పాత్రలను చూపుతూ నిరసన తెలిపారు.

కెరియర్ పాయింట్ ఫేర్వెల్ వేడుకలు
కాజీపేట అర్బన్ : కెరియర్ పాయింట్ సీనియర్ విద్యార్థుల ఫేర్వెల్ వేడుకలను కెరియర్ పాయింట్ ఇన్ఫినిటి ఆర్ఆర్–25 పేరిట మంగళవారం హంటర్‌రోడ్డులో ఘనంగా నిర్వహించారు. కెరియర్ పాయింట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు అభినందించారు.

నేడు క్రిస్మస్ వేడుకలు

- ముస్తాబైన చర్చీలు
- హాజరు కానున్న ప్రముఖులు
- కేక్‌ల కోసం కిక్కిరిసిన బేకరీలు
- ఆర్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


పరకాల : క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన పరకాల సీఎస్ఐ సెయింట్‌పాల్స్ చర్చి

పరకాల : ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది క్రైస్తవులు క్రీస్తు జననాన్ని జ్ఞాపకం చేసుకుంటూ నిర్వహించుకునే క్రిస్మస్ పర్వదిన వేడుకలకు పట్టణంలోని చర్చీలు ముస్తాబయ్యాయి. 100 ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని సీఎస్ఐ సెయింట్‌పాల్స్ చర్చీలో జరిగే క్రిస్మస్ వేడుకలకు వందలాది మంది క్రైస్తవులతో పాటు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, తరలిరానుండటంతో చర్చీ నిర్వహణ కమిటీ ఏర్పాట్లు చేసింది. వారంరోజులుగా క్రిస్మస్ ఉత్సావాలను నిర్వహిస్తుండగా రంగురంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా రోమన్ కాథలిక్ చర్చీ, మండుచున్న అగ్నికపావరం చర్చీ, బాప్టిస్ట్ చర్చీలకు కూడా క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న దృష్ట్యా ఆయా చర్చిల నిర్వహకులు ఏర్పాట్లు చేశారు. అలాగే బిట్స్ పాఠశాలలో చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. అలాగే మున్సిపాలిటీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ సుష్మా, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందితో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొని కేక్ కట్‌చేశారు.


కమలాపూర్ : కేక్ కట్‌చేస్తున్న ఝాన్సీరాణి

భారీగా కేక్ ఆర్డర్లు..
క్రిస్మస్ సందర్భంగా పట్టణంలో కేక్ ఆర్డర్లు భారీగా పెరిగాయి. క్రైస్తవులు చర్చీలోనే కాకుండా ప్రతి ఇంటా కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొంటారు. దీంతో కేక్ ఆర్డర్‌లతో స్థానిక బేకరీలు కలకలలాడుతూ నిండుగా కనిపిస్తున్నాయి.

మానవాళికి ప్రేమను పంచిన ఏసుక్రీస్తు
కమలాపూర్ : ప్రపంచ వ్యాప్తంగా మానవాళికి ప్రేమను పంచింది ఏసుక్రీస్తు అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం అధికారికంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ.. ప్రపంచానికి శాంతిని బోధించి సరైన మార్గంలో నడుస్తూ మార్గదర్శకుడిగా నిలవడమే కాకుండా శత్రువును సైతం ప్రేమించమని చెప్పిన గొప్ప వ్యక్తి ఏసుక్రీస్తు అన్నారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్లు ఏసుదాసు, ఆనంద్ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ బాబు, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎంపీఓ రవి పాల్గొన్నారు.

హాజరైన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


పరకాల : ఆర్ఆర్ గార్డెన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తోందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన హాజరై కేక్ కట్‌చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మనుషులందరిని ప్రేమించాలి, సేవా భావంతో మెలగాలన్న యేసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, ఆర్డీఓ డాక్టర్ నారాయణ, ఏసీపీ సతీష్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూమి, భుక్తి కోసం సీపీఐ పోరాటం

- జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్

ధర్మసాగర్ : పేదలకు భూమి, భుక్తి కోసం సీపీఐ పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ స్పష్టం చేశారు. మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో మంగళవారం సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ శాఖ కార్యదర్శి గోకల రాజయ్య అధ్యక్షతన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడుతూ.. ఎందరో సీపీఐ నాయకులు దేశవ్యాప్తంగా భూమి, భుక్తి కోసం, పేదల విముక్తికోసం పోరాటాలు చేసి అమరులయ్యారని గుర్తు చేశారు. 1925 సంవత్సరంలో స్థాపించిన సీపీఐ 2025 డిసెంబర్ 26 తేదీ నాటికి నూరేళ్లు పూర్తి చేసుకుందన్నారు. నాటి నుంచి నేటి వరకు దేశావ్యాప్తంగా పెదలకోసం అనేక పోరాటాలు చేసిన ఘనత సీపీఐదే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటేశ్, తెలంగాణ గిరిజన సమాఖ్య కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్, నాయకులు రాజారపు రత్నం, దేవన్న, చిన్నరాజు, గట్టయ్య, సునీల్, లింగం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎల్లేష్

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

- జేసీబీ, మూడు ట్రాక్టర్ల సీజ్

శాయంపేట : అనుమతి లేకుండా మట్టి తరలింపు, తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్సై పరమేశ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని నల్లకుంట చెరువు నుంచి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న జేసీబీ, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నల్లకుంట చెరువులో అనుమతులు లేకుండా తెల్లవారుజామున మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, జేసీబీని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. జేసీబీ ఓనర్ బూర్గుల రాజ్‌కుమార్, డ్రైవర్ ఆసిస్‌కుమార్, ట్రాక్టర్ డ్రైవర్లు దైనంపల్లి రాజు, నాగులగాని నాగరాజు, దైనంపల్లి విజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అక్రమంగా మట్టి తరలింపు, తవ్వకాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.


జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎస్సై పరమేశ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరకాల : 20 ఏళ్ల తర్వాత పట్టణంలోని శ్రీవాణి స్కూల్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని సంబురంగా జరుపుకొన్నారు. విద్యార్థి దశలో తాము పాఠశాలలో వ్యవహరించిన తీరు, ఉపాధ్యాయులు తీసుకున్న శ్రద్ధను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించి ఆటపాటలతో సందడి చేశారు. వందలాది మంది విద్యార్థులతో కలకలలాడిన తమ పాఠశాల నేడు మూతబడిపోవడం బాధగా ఉందని పూర్వ విద్యార్థులు వాపోయారు. పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు సాజిద్ అలీ, రవికుమార్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజేందర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చాలని యత్నిస్తే క్షమించరు
కేయూ క్యాంపస్: రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నిస్తే ప్రజలు క్షమించే పరిస్థితి ఉండబోదని పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంగరి భూమయ్య అన్నా రు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని రాజనీతిశాస్త్ర విభాగంలో విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం–సమకాలీన పరిస్థితులు అనే అంశంపై భూమయ్య విస్తృతోపన్యాసం చేశారు.

రాత పరీక్ష లేకుండా క్రమబద్ధీకరించాలి
హన్మకొండ అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు, ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండా యథావిధిగా రెగ్యులర్ చేయాలని వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం అందించారు.

సంక్షిప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో ఇటీవల మృతిచెందిన అబ్దుల్ రహీం కుటుంబాన్ని 1997–98 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

స్వర్గం రవి చేయూత..
మండల కేంద్రానికి చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబీకుడు జడల రమేశ్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్గం రవి మంగళవారం రూ.5 వేలు ఆర్థికసాయం పంపించారు. దీంతో ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి బాధిత కుటుంబీకులను పరామర్శించి రవి పంపించిన నగదును బాధిత కుటుంబానికి అందించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు తౌటం రవీందర్, విష్ణుదాసు వంశీ, ఆన్కార్ అశోక్‌జీ, కంబంపాటి ప్రసాద్, పెరుమాండ్ల పర్శరాములు, చంద్రశేఖర్, సాంబయ్య, రమేశ్, సుభాష్, మొగిలయ్య పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం
శాయంపేట : ఎస్సైగా జక్కుల పరమేశ్ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాదు నాగరాజు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చింతల రవిపాల్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు, పరకాల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారేపల్లి నందం, గ్రామశాఖ అధ్యక్షుడు రాజేందర్, సోషల్ మీడియా కన్వీనర్ సుమన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అదే విధంగా మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి ఎస్సైని కలిసి శాలువాతో సత్కరించారు.



చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ఐనవోలు : బిల్డింగ్ పైనుంచి కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని వెంకటాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా బుద్ధవనం గ్రామానికి చెందిన వడపాకు లోకేష్ (34) కొంతకాలంగా మండలంలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వెంకటాపురం, వనమాల కనపర్తితో పాటు తదితర గ్రామాల్లో సుమారుగా పది సంవత్సరాలుగా పలు బిల్డింగ్ నిర్మాణాలు చేపట్టాడు. ఈ క్రమంలో ఇటీవల వెంకటాపురం గ్రామంలో దోబిల మౌనిక ఇంటి నిర్మాణం చేపట్టి ఆ ఇంట్లోనే అద్దెకు ఉంటున్నాడు. కాగా సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కిరాయికి ఉంటున్న ఇల్లు మొదటి అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. అయితే ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కిందపడి మృతి చెందాడా? లేక ఇతర కారణాలు ఉన్నాయా? అని గ్రామంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా జఫర్‌ఘడ్ ఏఎస్సై రాజమౌళిని వివరణ కోరగా.. మృతుడు ఒక్కడే వెంకటాపురంలో నివాసం ఉంటున్నాడని, అతని కుటుంబ సభ్యులు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇక్కడకు చేరుకోకపోవడంతో ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



వేలేరు : వ్యక్తి అదృశ్యమైన సంఘటన పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై అజ్మీరా సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన గంగారపు మొగిలి కూలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే ఈనెల 21వ తేదీన బస్సులో హనుమకొండ పట్టణానికి కూలీ పనికి వెళ్లి సాయంత్రం తిరిగి రాలేదు. దీంతో మొగిలి కుమారుడు రఘు తండ్రి ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి కుమారుడు రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మొగిలి ఇంటి నుంచి వెళ్లే సమయంలో పసుపురంగు చొక్కా, లోపల ఎరుపు రంగు బనీయన్, లేతనలుపు రంగు ప్యాంటు వేసుకున్నాడని, ఆచూకీ తెలిసినవారు వేలేరు ఎస్సై ఫోన్ 8712685128, పోలీస్ స్టేషన్ నంబర్ 8712685011కి సమాచారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.

నిరుపేదల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్


కమలాపూర్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఒడితల ప్రణవ్

కమలాపూర్ : బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. మండలంలోని మాదన్నపేట, అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, నేరెళ్ల గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సుమారు 300 మంది కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు చరణ్‌పటేల్, మాజీ సర్పంచ్ కెత్తె రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కెత్తె విజేందర్ ఆధ్వర్యంలో ఒడితల ప్రణవ్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి అంబాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రణవ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా తీరుస్తూ ముందుకెళ్తుందన్నారు. ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి జరిగిందని, అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తమదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి, డైరెక్టర్ సముద్రాల కృష్ణ, గట్టు శ్రీధర్, నాయకులు రవీందర్, రాములు, ప్రసాద్, రాజిరెడ్డి, వంశీ, యుగేందర్, మనీష్, కుమారస్వామి, కనుకమల్లు, సమ్మయ్య, విజయ్, శివ, తేజ, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


ఫ్లెక్సీ ప్రదర్శనలో కాంగ్రెస్ నాయకులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
ఆత్మకూరు : రాష్ట్రంలోని నిరుపేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీని గ్రామాల్లో ఆవిష్కరించి అవగాహన కల్పించారు. రుణ మాఫీ, కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ తదితర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు, ప్రజలు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని కోరారు. రవీందర్ గౌడ్, కుమారస్వామి, రవి, రామకృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

వేధిస్తున్నారు.. చర్య తీసుకోవాలి

- మంత్రులను కోరిన ఎస్సీ హాస్టల్ కామాటి

కమలాపూర్ : తనను అకారణంగా వేధిస్తున్నవారిపై చర్యలు తీసుకుని తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కమలాపూర్ ఎస్సీ హాస్టల్ కామాటి వడ్లకొండ జ్యోతి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు, సోమవారం వినతిపత్రం అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. తాను కమలాపూర్ ఎస్సీ హాస్టల్‌లో కామాటిగా (ఔట్ సోర్సింగ్) పని చేస్తున్నానని, సుమారు రెండు నెలల క్రితం హాస్టల్‌లో సరైన సిబ్బంది లేక వార్డెన్ రాజన్న తనను వంట చేయమని చెప్పినట్లు తెలిపారు. వంట సామాన్లు తక్కువ ఇస్తున్న వార్డెన్.. పిల్లలకు సరైన భోజనం పెటట్టం లేదని, తనను కూడా మానసికంగా ఇబ్బందులకు గురిచేశాడని ఆరోపించారు. గతేడాది ఫిబ్రవరిలో అప్పటి ఏఎస్‌డబ్ల్యూఓపై తాను కోర్టులో వేసిన కేసును కాంప్రమైజ్ కావాలని వార్డెన్ పలుమార్లు అడుగగా అందుకు తాను నిరాకరించానని తెలిపారు. దీంతో వార్డెన్ అతనికి పరోక్షంగా సహకరిస్తూ 'కేవలం నువ్వొక ఔట్ సోర్సింగ్ ఉద్యోగివి, నాకు ఎదురు చెప్తావా, మంచి చెడులు భరించే దానివైతేనే ఇక్కడ డ్యూటీ చేయాలి' అంటూ తనపై లేనిపోని అభాండాలు మేపి డీడీకి చెప్పి తనను విధులకు రాకుండా చేశాడని ఆరోపించారు. ఈ విషయంలో తాను డీడీని కలిస్తే వార్డెన్ అన్ని విషయాలు చెప్పాడని, నువ్వు ఆఫీస్‌కు రావద్దని తనకు మాట్లాడే అవకాశం కల్పించకుండా పంపించినట్లు తెలిపారు. తనను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న వార్డెన్ రాజన్న, భద్రయ్య, డీడీ, మనోహర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న జ్యోతి

యాసంగి సాగుకు వేళాయె..


మండల కేంద్రంలో వరినారు తీస్తున్న కూలీలు

వేలేరు : మండలంలో యాసంగి సీజన్ వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నిండాయి. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బావులు, బోర్లలో నీటి మట్టం పెరిగింది. రానున్న ఎండాకాలంలో ఎండలకు బావులు, బోర్లు ఎండిపోయి పంట చివరి దశకు సాగునీరు అందక ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో రైతులు ముందుగానే వరినాట్లు వేస్తున్నారు. ఇప్పటికే సూమారు 7 వేల ఎకరాల పైచిలుకు వరినాట్లు వేశారు. కాగా ప్రభుత్వం సన్నాలకు రూ.500 సబ్సీడీ ఇస్తుండటంతో రైతులు సన్నాల సాగుకే మొగ్గు చూపుతున్నారు.

పామాయిల్ తోటకు నిప్పు



నడికూడ : పామాయిల్ తోటకు నిప్పు అంటుకున్న సంఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పరకాల పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోనెల హరిమోహన్‌కు 5 ఎకరాల ఆయిల్‌పామ్ తోట ఉంది. యజమాని సోమవారం సాయంత్రం వెళ్లి చూడగా సుమారు ఎకరంన్నర మేరకు కాలిపోగా, 30 నుంచి 40 పామాయిల్ చెట్లు, డ్రిప్ పైపులు కాలిపోయినట్లు తెలిపారు. అయితే తోట పక్కన మరో రైతు వరి పొలంలోని కొయ్యలు కాల్చుతుంటే మంటలు ఎగసిపడి ఈ ప్రమాదం జరిగినట్లు బాధిత రైతు ఆరోపిస్తూ ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనం నడుపుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. వీరిని మంగళవారం పరకాల సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శాలిని లింగం ఎదుట ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి రూ.7,050 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. పుట్ట సాయిచరణ్, సయ్యద్ జహంగీర్, పంగ శివప్రసాద్, దానబోయిన రాజు, గజ్జి ఐలయ్య, ఇమ్మడిశెట్టి రాజేందర్, మహమ్మద్ సుల్తాన్‌కు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై అన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల ఫీజు తగ్గించాలి
కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని మూడు రోజుల క్రితం విడుదల చేసిన డిగ్రీ ఇయర్ వైజ్ బ్యాక్ లాగ్ సబ్జెక్టుల పరీక్షల ఫీజు తగ్గించాలని కేయూ బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్‌ఎఫ్) నాయకులు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.